ఉన్నట్లుండి అకస్మాత్తుగా మదన్‌ను చూడాలనిపించింది మధూలికకు. అది నిలువనీయని కోర్కెై తక్షణం ఆటోలో మదన్ పనిచేసే ఆఫీసుకు చేర్చింది-

నిజానికి మధూలిక, మదన్‌లు వచ్చే నెలలోనే వెడ్‌లాక్‌లో ఒకరి కొకరు బందీలు కాబోతున్నారు. దూరపు బంధుత్వం వుంది. స్వయంగా ఇద్దరికీ పరిచయం కూడా ఈ మధ్య జరిగింది. పెద్దవాళ్ళు ఇద్దరికీ ముడిపెట్టెయ్యాలని నిర్ణయించేసుకున్నారు. మధూలికకు కూడా అతనంటే తొలి చూపులోనే ఆకర్షణ-ఇష్టం ఏర్పడ్డాయి. దానికి కారణం మదన్ హాండ్సమ్ పర్సనాలిటీయే. ఆర డుగుల ఎత్తుతో- చక్కని ఆరోగ్యకరమైన వంటితో- కన్ను తిప్పుకోనీయని స్ఫుర ద్రూపంతో, చక్కని ముఖకళతో మదన్ ఆమె హృదయాన్ని మంత్రించినట్టే ఇట్టే వశం చేసుకున్నాడు. అటు పెద్ద వాళ్ళు కోరుకునే విద్య, వినయ-సుగుణ సంపద. ఇటు అమ్మాయి కోరుకునే రూప సంపద మదన్‌లో వుండటంవల్ల వాళ్ళ వివాహానికి ఎవరికీ ఏ విధమైన అభ్యంతరం కనపడలేదు.

ఇక మదన్ సంగతి సరేసరి. మన. సుకు నచ్చిన మగువకోసం అతను తపస్సు చేస్తున్నాడింతకాలం. అందం, చదువు- మంచి ఉద్యోగం అన్నీ వున్న మధూలిక అంటే అతనికీ ఎంతో ఇష్టం ఏర్పడింది. ఇక కాలయాపన చెయ్యకుండా అతి దగ్గరలో ముహూర్తం ఏర్పాటు చేసుకున్నాడు.

మత్తుమత్తుగా క్రొంగొత్త మధురోహలతో సందడిస్తున్న గుండెతో ఆఫీసు ముందు ఆటో దిగింది. సడెన్ సర్‌ప్రైజ్ ఇస్తే అతనెంత ఉక్కిరి బిక్కిరై పోతాడోనన్న చిలిపి ఊహతో ముందు ఫోన్ అయినా చెయ్యకుండా వచ్చేసింది.

అప్పటికి మధ్యాహ్నం రెండు గంటలు దాటి ఏడు నిమిషాలైంది. ఆఫీసు స్టాఫ్ మెంబర్సంతా లంచ్ రూంలో వున్నారు. మదన్ ఆఫీసులో పని చేసే లేడీక్లర్క్ ఒంటరిగా తన టేబిల్ దగ్గరే టిఫెన్ చేస్తోంది. మధూలిక ఎవరో ఎరగక పోయినా “రండి... కూర్చోండి. ఎవరు కావాలి? అందరూ లంచ్ చేస్తున్నారు” అంది. మధూలిక నవ్వి కాస్త ఎడంగా వున్న కుర్చీలో కూర్చుంది. ఆమె వచ్చింది మదన్‌ను చూడాలన్న కోరికతోనే... అయినా అంతమంది కలిసి లంచ్ చేస్తుండగా లోపలికి వెళ్ళడం బాగుండదనిపించింది.

లంచ్ రూంలోంచి గోల, గోలగా మాటలు, నవ్వులు వినిపిస్తున్నాయి. ఆఫీసులోని జంట్సందరూ స్వేచ్ఛగా కబుర్లు చెప్పుకుంటూ లంచ్ తీసుకుంటున్నట్లున్నారు.

“తినవోయ్... కొత్తగా పెళ్ళైన వాడివి ఆమాత్రం దిట్టంగా తినక పోతే... ఏనేం చేస్తావ్...” మదన్ గొంతు పది మంది నవ్వుల మధ్య కంచు గంటలా వినిపిస్తోంది. మధూలిక అతని గొంతు పోల్చుకొని శ్రద్ధగా వింటోంది.

“అసలు పెళ్ళైన కొత్తలో అత్తారింట్లో మినపసున్నుండలూ, పూత రేకులూ, నేతి గారెలు... ఎందుకు పెడతారో తెలుసా...?”



“ఎందుకుట?” ఎవరో నవ్వుతూ




ఆంధ్రా అంతట పంపిణీదారులు గావలెను. వెంటనే సంప్రదించండి.




అడుగుతున్నారు.

"నువ్వు చెప్పవోయ్ ప్రమోద్. సీనియర్‌వి కదా..." మదన్ అంటున్నాడు రెచ్చగొడుతున్నట్లు.

అతనెవరో సిగ్గుపడుతూ "నువ్వే చెప్పు గురూ నాకు తెలీదు" "నీకేం తెలుసు బ్రదర్... ఒక్కటే తప్ప. అందొక్కటే కదూ గురూ!" "ఛ! ఊరుకో గురూ!"

ఆ పర్లేదు గురూ మన్లో మనకేటి చెప్పు గురూ... రోజూ ఎన్ని సార్లేస్తున్నావోయ్ జాటింగ్స్..." అందరూ పగలబడి నవ్వుతున్నారు.

"ఊరుకో మదన్... ఏవిటా మాటలు...?"

"ఏం తప్పా... అంత సిగ్గేవిటి గురూ! ఆడదానిలా ఈ రోజుల్లో ఆడాళ్ళే సిగ్గుపడడం మానేసారు." మదన్ నవ్వుతూ అంటున్నాడు.

ఎవరో అందుకున్నారు "ఆడాళ్ళు సిగ్గుపడడం మానేసారు, మగాళ్ళు సిగ్గుపడుతున్నారు. అంతా తల్లక్రిందులే కదా."

మదన్ పకపక నవ్వుతూ "ఏటి గురూ అయితే నువ్వు తల్లక్రిందులుగా తీస్తున్నావేమిటి జాటింగ్స్ బాలెన్స్‌వుతోందా?"

గుక్కతిప్పుకోకుండా నవ్వులు... పక... పక... పెద్దగా

"బాలెన్స్ కాకపోవడమేం. పెళ్ళై మూడు నెళ్ళు... ఇప్పుడు మూడో నెల..." మదన్ నిర్లజ్జగా అంటున్నాడు.

"ఏవిటి నీకే... అంత అడ్వాన్సై పోయావా మదన్...!"

"తప్పేంలేదు గానీ... వ్యవహారం బెడిసి కొట్టుతుందని చూస్తున్నాను. మగాడెన్ని తిరుగుళ్ళు తిరిగినా పెళ్ళాం దగ్గర కాస్త కేర్‌ఫుల్‌గా వుండాలి. ఆడాళ్ళని నమ్మించటమే కష్టం. ఒకసారి నమ్మారా. ఇక నీ ఇష్టం..." గర్వంగా ఉపదేశించాడు మదన్.

"ఓహ్. ఏం చెప్పావ్ గురూ. ఎంతైనా మన మదన్ మేధావండి."

"అదిసరే కాని మదన్ నువ్వెన్ని సంబంధాలు చూసావయ్యా."

"వుంటాయ్... ఓ వంద..."

"అబ్బ...! అంతమందీ నచ్చక పోవటమంటే..."

"ఏముంది గురూ... చదువుంటే- ఉద్యోగం వుండదు. ఉద్యోగం వుంటే అందం వుండదు. ముందుంటే వెనకుండదు వెనకుంటే ముందుండదు..."

మళ్ళీ పకపక నవ్వులు... "వెనకెందుకు గురూ- ముందుంటే చాలదూ!"

"కట్నం ఎంత బ్రదర్."

"కట్నమా... అమాయకుడా... నెలనెలా వేలుతెచ్చిపోసి బంగారు బాతును కాబోయే పెళ్లాం- ఇంకా కట్నమెందుకు. అయినా ఒకటి గుర్తుంచుకో ఈ రోజుల్లో ఆడదాన్ని కట్నం అడగకూడదు. స్వేచ్ఛా-సమానత్వం అని లెక్చర్లిస్తే లక్షలు సంపాదించిపోస్తుంది నోరెత్తకుండా."

"వెల్ సెడ్ గురూ..." చప్పట్లు నవ్వులు, గొల్లున గోల... మధూలిక ముఖం తెల్లకాగితంలా అయింది. మదన్ అలా మాట్లాడుతున్నాడేమిటి? లంచ్ టైం పూర్తికావచ్చింది.

లోపల్నించి ఏవేవో కామెంట్స్- వెకిలి మాటలు- అరుపులు నవ్వుల మధ్య చాక్లీలు- స్పూనుల మోత వినిపిస్తోంది.

మధూలిక నిశ్శబ్దంగా లేచింది.

క్లర్క్ చూసి స్నేహంగా అంది "ఎవరు కావాలండి... కూర్చోండి లంచ్ టైం అయిపోయింది. వచ్చేస్తారింక అంతా..."

మధూలిక నవ్వాలని ప్రయత్నించింది. ముక్తసరిగా "ఎవరూ వద్దండీ... థాంక్స్..." అని బయటకు వచ్చింది.

మదన్ వెకిలి, మాటలు కుళ్ళు జోకులు చెవుల్లో రింగుమంటున్నాయి. అందంగా నిగనిగలాడుతూ కళ్ళు చెదరగొట్టే ఎర్రని మేడి పండు పొట విప్పి చూసినట్లైంది. అసహ్యంతో మనసు జలదరించింది! అందమైన రూపానికి అందమైన మనసుండదా... పబ్లిగ్గా ఆఫీసులో పది మంది ముందు అంత అసహ్యాకరంగా జుగుప్సాకరమైన డోకుల్లాటి జోకులు పేలుస్తాడే... అతని హృదయగత సంస్కారం ఏ స్థాయిలో వుందో తెలియడం లేదూ...!

సాయంత్రానికి మధూలిక తనతో ఎంగేజిమెంట్ కాన్సిల్ చేసుకున్నట్లు వార్త అంది మదన్ నివ్వెరపోయాడు. ఆమె ఎందుకలా చేసిందో అతని కస్సుడే కాదు... ఎప్పటికీ అర్థం కాదు- చేసుకునే అవకాశం లేదు.

